విశాలాంధ్ర గుంటూరు జిల్లా

విజ్ఞాన్స్ ఫార్మసీతో సీఎస్‌సీ అకాడమీ ఒప్పందం

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాల భారత ప్రభుత్వం లోని మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ విభాగంతో నిర్వహిస్తున్న విశాఖపట్నంలోని సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్) అకాడమీతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎస్‌సీ అకాడమీ వర్చువల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ రామ్‌మోహన్ రావుతో అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన విద్యార్థులకు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్ టెక్నాలజీపైన ఉచిత శిక్షణ అందించి సర్టిఫికెట్‌లను అందిస్తామన్నారు. రామ్ మోహన్ రావు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు ఇండస్ట్రీ లేదా వృత్తితో సంబంధం లేకుండా డిజిటల్ ప్రపంచంలో వస్తున్న సాంకేతికతను స్వీకరించాలన్నారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

వడ్డేరలకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్రంలో వడ్డెరలకు సముచిత స్థానం కల్పించాలని చట్ట సభలలో అవకాశం కల్పించాలని వడ్డెర సాధికారత రాష్ట్ర సభ్యులు వడ్డే వెంకట్ కోరారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని సోమవారం సాయంత్రం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో వడ్డెర సాధికారత కమిటీ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు వేముల శివ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడనుండైనా వడ్డెరలకు ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరారు. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు తిరుపాల్ బాబు, స్టేట్ మెంబర్ గుంజి అంకమ్మరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వడ్డెరలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. వడ్డెర్లు మంగళగిరిలో నారా లోకేష్‌కి అండగా ఉండి గెలిపించాలంటే వడ్డెర్లకు సముచిత స్థానం కల్పించాలన్నారు. నియోజకవర్గ అధ్యక్షులు వేముల శివ మాట్లాడుతూ త్వరలో మంగళగిరి నియోజకవర్గంలో వడ్డెర్ల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు గొడ్డెలగల జయలక్ష్మి, గొడ్డెలగల శ్రీనివాసులు, వేముల దుర్గారావు, ఉప్పుతల వాసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, స్టాఫ్ నర్సుల వివరాలు నమోదు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం)కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలలో పని చేసే వైద్యులు, స్టాఫ్ నర్సుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్‌ఓ)డాక్టర్ కె.విజయలక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని సెంటర్ల రెన్యువల్స్‌ను నిలిపివేయబడతాయని అన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పట్టణ నియోజకవర్గాలలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుండి 12.45 ని॥ల వరకు జరిగాయి. విద్యార్థులు పరీక్ష సమయానికే పాఠశాలలకు చేరుకున్నారు. అన్ని కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పాఠశాలల వద్ద విద్యార్థులకు కావలసిన అన్ని ఏర్పాట్లను పాఠశాల నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కమీషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల ప్రకారం సోమవారం అన్ని పాఠశాలలలో పరీక్షలు నిర్వహించారు.

నగరంలో పెమ్మసాని వైబ్రేషన్స్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఇపుడు ఎక్కడ చూసినా మ్మసాని వైబ్రేషన్స్ కనిపిస్తున్నాయని ప్రముఖ వైద్యులు మన్నవ రాధా కృష్ణ మూర్తి (ఎండీ) చెప్పారు. స్థానిక బ్రాడి పేటలోని మన్నవ నివాసానికి వెళ్లిన టీడీపీ నాయకులు డా.పెమ్మసాని చంద్రశేఖర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డా.మన్నవకు శాలువా కప్పి సత్కరించిన పెమ్మసాని కాసేపు ఆయనతో మాట్లాడారు. వైద్యునిగా మన్నవకు ఉన్న అనుభవం తదితర అంశాలు ఈ సందర్భంగా చర్చించుకున్నారు. వైద్యులు రాధా కృష్ణ మూర్తి మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో ప్రజలందరూ చర్చించుకునే స్థాయి అందరికీ దక్కదని, ఆ స్థాయిలోనే ముందుకు వెళ్లాలని సూచించారు.

ప్రభుద్ధ రిపబ్లిక్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా అనిల్ కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రభుద్ధ రిపబ్లికన్ పార్టీ గుంటూరు ఎంపీ అభ్యర్థిగా జెల్ది అనిల్ కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు తెలియజేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల కోసం జిల్లాలోని అభ్యర్థుల ఎంపిక, పార్టీ బలోపేతం, దళిత బహుజన సమస్యల పరిష్కారం వంటి అంశాలపై జిల్లా స్థాయి నాయకులకు సూచనలు సలహాలు అందించటం జరిగిందని తెలిపారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో తనకు ఓటు వేసి తన విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు. జాన్ బాబు, లింగంగుంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ముస్లింల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని మిర్చియార్డ్ మాజీ డైరెక్టర్ షేక్ చిన్న బాజీ అన్నారు. సోమవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం కేటాయించిన వేల కోట్ల రూపాయలు నిధులు దారి మళ్లించి రాష్ట్ర ముస్లిం మైనార్టీలకు తీరని ద్రోహం చేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పటానికి మైనారిటీలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. దైవదర్శనానికి హజ్ యాత్రకు వెళ్లే వారికి హజ్ హౌస్‌ల నిర్మాణం, వారికి సబ్సిడీలు, దుల్హన్ పథకం అందిస్తానని వాగ్దానం చేసిన జగన్‌రెడ్డి ముస్లింల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తూ ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. కె.యం.ఇ హుస్సేన్, పుల్లా సుందరాంబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అగ్రహాన్ని తెలిపిన ప్రజాగళం సభ

విశాలాంధ్ర-గుంటూరు : బొప్పూడిలో జరిగిన ప్రజాగళం ఉమ్మడి సభలో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న ప్రజాగ్రహం స్పష్టంగా కనిపించిందని టీడీపీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. అర్బన్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. వైసీపీని ఓడించాలనే కసితో ప్రజలు స్వచ్ఛందంగా తండోపతండాలుగా తరలివచ్చారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి వచ్చే సభకు భద్రతా ఏర్పాట్లు చూడాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలు ఏర్పాటు చేసినప్పటికీ పోలీసుల వైఫల్యంతో జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయిందని తెలిపారు. సభలో స్వయంగా ప్రధానమంత్రి మోదీ పోలీసుల తీరును తప్పుపడుతూ ప్రజలకు విజ్ఞప్తులు చేయాల్సి వచ్చిందన్నారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన సీనియర్ పోలీసు అధికారులు తమ విధుల్లో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారో చెప్పాలన్నారు. మైకుల వద్ద గుమ్మిగూడిన వారిని నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభను విజయవంతం చేశామని తెలిపారు.

ఎన్నికల నియమావళి అమలుకు సహకరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ రాజకుమారి, కమీషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్వో పెద్ది రోజాతో కలసి ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల ఖర్చులు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించనప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని, 24 గంటల్లోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు, ప్రభుత్వ ప్రచార పథకాల పోస్టర్లు తొలగించటం జరిగిందన్నారు. మంజూరు చేసిన అభివృద్ధి పనులలో ప్రారంభం కాని వాటిని నిలిపివేస్తామని, జరుగుతున్న పనులు యధావిధిగా కొనసాగిస్తారని అన్నారు. ఎన్నికల ఖర్చుకు సంబంధించిన రాజకీయపార్టీలు, అభ్యర్థులు నిర్దేశించిన ఫార్మేట్‌లో ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ కమిటీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పార్లమెంట్ అభ్యర్థికి రూ.95 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థికి రూ.40లక్షలు ఖర్చు చేసుకునే పరిమితి ఉందన్నారు. ప్రచార పోస్టర్లు, ప్రకటనల మ్యాటర్‌ను ముందుగానే ఎంసీఎంసీ కమిటీ వద్ద అనుమతి తీసుకొని పబ్లిష్ చేయాల్సి ఉంటుంద న్నారు. సంయుక్త కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ మంగళగిరిలో 4000 వరకు తోపుడు బండ్లపై రాజకీయ పార్టీల ప్రతినిధుల బొమ్మలు, పేర్లు ఉన్నాయని వాటిని వెంటనే యజమానులు కవర్ చేయాలన్నారు. రహదారులపై ఏర్పాటు చేసిన బెంచీలపై ఉన్న రాజకీయ పార్టీల నాయకుల పేర్లను కవర్ చేయాలన్నారు. రాజకీయ పార్టీలు దీనికి సహకరించాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో పి శ్రీఖర్, గుంటూరు పార్లమెంట్ సహాయక రిటర్నింగ్ అధికారి భీమారావు, ఎలక్షన్ ఎక్స్పెండిచర్ కమిటీ నోడల్ అధికారి శివరామకృష్ణ, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

వైసీపీతోనే ప్రజలకు మేలు: మంత్రి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలందరికీ మేలు చేకూరుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఆ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరులోని ఏటీ అగ్రహారం 6వ లైనులో పరశురామ బ్రాహ్మణ సంఘం మహిళా విభాగం కార్యదర్శి నందిరాజు మీనాక్షి ఆధ్వర్యంలో సోమవారం 30 మంది మహిళలు తెలుగుదేశం పార్టీ వీడి వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నారని, మహిళల్లో పెద్ద ఎత్తున సానుకూల స్పందన కనిపిస్తున్నదని తెలిపారు. చంద్రబాబు నాయుడు కేవలం అధికారమే పరమావధిగా కూటములు కడుతున్నారని, అలవికాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. కార్పొరేటర్లు రోషన్, అందుగుల సంతోష్, ఆయా డివిజన్ల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ఆయా అనుబంధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటీటీలపై కేంద్రం నిషేధం

విశాలాంధ్ర-తెనాలి : విచ్చల విడి శృంగారాన్ని చూపిస్తున్న 18 ఓటిటి ఫ్లాట్‌ఫామ్‌లను కేంద్ర ప్రభుత్వం తాజాగా నిషేధించడం దేశ ఆచార సాంప్రదాయాలను గౌరవించడ మేనని మా-ఎపి వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా అన్నారు. పెదరావూరులో ఆయన స్టూడియోలో సోమవారం మాట్లాడారు. ఆయా ఓటీటీలకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను కూడా బ్లాక్‌లో పెట్టి మితి మీరిన శృంగారాన్ని అదుపులో పెట్టే ప్రయత్నాన్ని కేంద్ర సమాచార ప్రసార శాఖ చేసిందన్నారు. దీని వలన 57 సోషల్ మీడియా ఖాతాలు, 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లను భారతదేశంలో ఇక నుండి చూడలేరని చెప్పారు. ఈ అంశాన్ని ఎన్నో పర్యాయాలు తాను కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి మురుగన్‌కు స్వయంగా మొరపెట్టుకున్నానని అన్నారు. నేటి యువతరం ఫోన్‌లో పోర్న్ వీడియోలు చూస్తూ పెడదారి పడుతున్నారని ఆయన చెప్పారు. ఓటీటీ, వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలపై సెన్సార్ విధిగా ఉండి తీరాలని కేంద్రానికి తిరిగి మనవి చేశారు.

సుబ్బాయమ్మకు సీపీఐ నాయకుల నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి: సీపీఐ నాయకురాలు, పెద్దవడ్లపూడి మాజీ వార్డ్ మెంబర్ ఎల్లనూరి సుబ్బాయమ్మ అనారోగ్య కారణంగా సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమెకు పాప, బాబు ఉన్నారు. గ్రామంలోని నివాసం వద్ద ఆమె భౌతిక కాయానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, జవ్వాది సాంబశివరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో రాజారావు, సిద్దయ్య, శివకుమారి, అరుణ, సీపీఐ గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

5న 'ఏపీ జీఈఎ' జిల్లా ఎన్నికలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ) గుంటూరు జిల్లా ఎన్నికలు ఏప్రిల్ 5న ఉదయం 10 గంటల నుంచి 2గంటల వరకు జరుగుతాయని ఏపీ జీఈఎ గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం గుంటూరు మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఏపీ జీఈఎ గుంటూరు జిల్లా కార్యాలయంలో చాంద్‌బాషా జిల్లా ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీ జీఈఎకు సంబందించిన న్నికలకు జిల్లా ఎన్నికల అధికారిగా జి.నాగసాయి (రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ), సహ ఎన్నికల అధికారిగా కిషోర్ కుమార్ (రాష్ట్ర కార్యదర్శి)రానున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల నామినేషన్ కార్యక్రమం మార్చి 28న ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు ఏపీ జీఈఎ కార్యాలయం నందు స్వీకరించడం జరుగుతుందన్నారు. నామినేషన్ ఉప సంహరణ మార్చి 29 తేదీ ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు అవకాశం ఉంటుందని, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 తాలూకా యూనిట్‌ల నుంచి 137 మంది కార్యవర్గ సభ్యులు, నగర శాఖ కార్యవర్గ సభ్యులు పాల్గొంటారని, వీరందరూ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, సహాధ్యక్షులు మహేష్ బాబు, జిల్లా ఆర్గనైజ్ సెక్రెటరీ కరీముల్లా షాఖాదరి, జిల్లా ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో క్రైస్తవులకు పెద్దపీట: ఫాతిమా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో క్రైస్తవుల అభివృద్ధికి పెద్దపీట వేశారని గుంటూరు తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి షేక్.నూరి ఫాతిమా పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం వైఎస్సార్‌సీపీ 54వ డివిజన్ కార్పొరేటర్ మల్లవరపు రమ్య ఆధ్వర్యంలో 'షేకెము ప్రార్థన మందిరం'లో క్రైస్తవుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రైస్తవులకు ఏ సమస్య వచ్చిన నా దృష్టికి తీసుకురావాలని కోరారు. క్రైస్తవ నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్న జగన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు మల్లవరపు రవిరాజ్, మల్లవరపు దాస్, షేకెము ప్రార్థన మందిరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఎన్నికల నియమావళిపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీల వారందరూ ప్రతిదానికి అనుమతి తీసుకోవాలని కోరారు. మంగళగిరి నియోజక వర్గంలో 300 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా సహకరించాలని కోరారు. ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, పోలీసులు కేసులు పేరుతో తమ కార్యకర్తలను నాయకులను తీసుకువెళ్లి వేధింపులు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు జేవీ రాఘవులు మాట్లాడుతూ ఏజెంట్లు నియమించే ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, టీడీపీ నాయకులు జి.దుర్గారావు, సీపిఐ ఎం.శ్రీనివాసరావు, మంగళగిరి తహశీల్దార్ కె.వెంకటేశ్వరరావు, రమేష్ కుమార్, అడిషనల్ కమిషనర్ కె.ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులను మోసం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-మంగళగిరి : వైసీపీ ప్రభుత్వం స్వర్ణకారులను మాయ మాటలు చెప్పి మోసం చేస్తుందని ఏపీ రాష్ట్ర స్వర్ణకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి వేణుమాధవ్ విమర్శించారు. మంగళగిరి నగరంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వేణుమాధవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. రానున్న ఎన్నికలలో లబ్ది పొందేందుకు, స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని హైడ్రామా చేసి రిలే నిరాహార దీక్షలను విరమింపచేశారన్నారు. స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మంగళగిరి స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు జగ్గవరపు రాము, మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ గెలుపు కోసం స్వర్ణకారులందరూ ఏకతాటిపై ఉండి కృషి చేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్వర్ణకారుల సంక్షేమ కార్యదర్శి మంద్రు రాము, శ్రీ లక్ష్మీనరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుంటి నాగరాజు, కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, పీఆర్వో కందుల నాగార్జున, ఉపాధ్యక్షులు కొల్లి రాంకుమార్, పీఆర్వో అడిగొప్పల శ్రీనివాసరావు, బల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జైనులను గుర్తించి గౌరవించిన జగన్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశంలోనే మొట్టమొదటి సారిగా జైన మతస్థులను గుర్తించి గౌరవించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందని ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కొనియాడారు. వారి అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా జైన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే అందుకు నిదర్శనమన్నారు. జైన మతస్థులు 14 నెలల పాటు నిష్టగా నిర్వహించే 'వర్షిత తపస్య ఉపవాస దీక్షా మహోత్సవాలు' స్థానిక అరండల్‌పేట మూడవ లైను 1వ అడ్డరోడ్డులో ఉన్న పార్శ్వనాథ్ దేవాలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగుతు న్నాయి. ఈ సందర్భంగా సోమవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి విడదల రజినితో కలిసి అప్పిరెడ్డి హాజరయ్యారు. ఆదినాథ్ భగవాన్, పార్శ్వనాథ్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ జైన మతస్థుల దీక్షాధక్షతను ప్రశంసించారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఈ పవిత్ర దీక్షల సందర్భంగా జైన మతస్థులను కలవడం శుభపరిణామంగా భావిస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగిన తనకు మీ వంటి సమాజ హితాన్ని కాంక్షించే మంచి మనస్కుల మద్దతు కావాలని కోరారు. గుంటూరు జైన సంఘం ప్రతినిధులు జయంతిలాల్, రాజేష్, పప్పు, ముకేష్, మహేంద్ర గులేచా, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు పోలూరి వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, జగన్ కోటి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి గుండె జబ్బుల ఓపీ సేవలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జీజీహెచ్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రతిరోజూ గుండె జబ్బుల ఓపీ సేవలు చూస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆసుపత్రిలోని క్షయ నియంత్రణ కేంద్రాన్ని ఆయన పరిశీలిం చారు. గత రెండు నెలల నుంచి టీబీ సెంటర్‌లో గుండె జబ్బుల ఓపీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అందుకు తగ్గట్టుగా గుండె జబ్బుల ఓపీని సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ టీబీ కేంద్రాన్ని మహిళల పీజీ వసతి గృహం ఎదురుగా ఉన్న నూతన భవనంలోకి మారుస్తున్నట్లు వెల్లడించారు. గుండె జబ్బుల ఓపి వైద్యులకు, రోగులకు అందుబాటులో ఉండేవిధంగా ఆరు గదులను ఆధునీకరిస్తున్నామని, సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ సేవలను విస్తరింపజేస్తున్నట్లు వ్యాఖ్యానించారు. జింఖాన అధ్యక్షుడు డాక్టర్ పాదిల ప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్ ఉన్నారు.

మంగళగిరిని అభివృద్ధికి కేరాఫ్‌గా మారుస్తా: లోకేష్

విశాలాంధ్ర-మంగళగిరి: అభివృద్ధికి కేరాఫ్‌గా మంగళగిరిని మార్చడమే లక్ష్యమని, రాబోయే ఎన్నికల్లో తనకు అవకాశమిస్తే అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని తటస్థ ప్రముఖులను సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తొలుత మంగళగిరి 8వవార్డుకు చెందిన ప్రముఖుడు అందే వెంకన్న నివాసానికి వెళ్లారు. ప్రధాన సమస్యలతో పాటు పద్మశాలి సామాజిక వర్గీయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంకన్న ప్రస్తావించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా తాను రాష్ట్రవ్యాప్తంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలపై లోతైన అధ్యయనం చేశానని, అధికారంలోకి వచ్చాక శాశ్వత పరిష్కారం చూపుతానని చెప్పారు. తర్వాత నవులూరు వెళ్లి యాదవ సామాజికవర్గ ప్రము ఖుడు, రైస్ మిల్లర్, ఇటుకల వ్యాపారి బత్తుల శ్రీనివాసరావును కలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము నిర్వహి స్తున్న వ్యాపారాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను యువనేత దృష్టికి తెచ్చారు. నియోజకవర్గ పరిధిలో యాదవ సామాజికవర్గీయులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావించారు. బీసీలకు అన్ని విధాలా అండగా నిలిచేది టీడీపేనని, రాబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. చివరగా యర్రబాలెం వెళ్లి ముస్లిం సామాజికవర్గ ప్రముఖుడు, ఆటోమొబైల్ వ్యాపారి సయ్యద్ బాజీ షేక్‌ను కలుసుకున్నారు. అమరావతి నిర్మాణ పనులను నిలిపివేయడం వల్ల తమ గ్రామంలో ఎంతో మంది యువకులు నిరుద్యోగులుగా మారారని తెలిపారు. యర్రబాలెంలో షాదీఖానా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. లోకేష్ స్పందిస్తూ తమ నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అమరావతి నిర్మాణ పనులను పరుగులు తీయిస్తారని, షాదీఖానా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు గుంటూరు జిల్లా & రూరల్(మం),బొన్నలగడ్డ గ్రామము,వలహారెడ్డి పాలెం గ్రామస్తులు లేటు పుల్లగం మల్లికార్జున రెడ్డి గారి కుమారుడు శ్రీనివాసరెడ్డి(సెల్: 9000192491) గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు పేరుతో ది:09-06-2014న విక్రయ దస్తావేజు నెం:1987/2014 గా తాడికొండలో రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజు యొక్క ఒరిజినల్ లింకు విక్రయ దస్తావేజు నెం:803/1996 మరికొన్ని డాక్యుమెంట్లు తీసుకొని ది.15-03-2024న తాడికొండ సబ్ రిజిష్ట్రార్ ఆఫీస్ నందు పని నిమిత్తం వెళ్లి అక్కడ జిరాక్స్ షాపు నందు జిరాక్స్ తీయించుకొని రిజిష్ట్రార్ ఆఫీస్ కి వెళ్ళు క్రమంలో సదరు పై తెలిపిన ఒరిజినల్ లింకు విక్రయ దస్తావేజు నెం:803/1996 కనిపించలేదు. సదరు దస్తావేజు కోసం అచుట్టుపక్కల ఎంత విచారించినను దొరికియుండలేదు. కావున సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల నాకు గాని నా క్లయింటుకు గాని అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.అట్లుగాక సదరు దస్తావేజును ఉపయోగించి ఏ విధమైన అన్యాక్రాంతములు చేసినను నా క్లయింట్ తీసుకొను చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

జె.వెంకట సుబ్బా రెడ్డి, అడ్వకేటు, గుంటూరు,సెల్.9705330633

ఎన్నికల నియమావళి అమలుకు చర్యలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలుకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్‌ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అధికారు లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సార్వత్రిక ఎన్నికల కోడ్ మేరకు నగరంలోని ప్రభుత్వ ఆస్తులపై గల అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాల తొలగింపు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలో ఎక్కడైనా పెండింగ్ ఉంటె సోమవారం సాయంత్రానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్.ఈ శ్యాంసుందర్, సి.యం.ఓ.హెచ్ డాక్టర్ ఆషా, డిప్యూటీ కమీషనర్ వెంకట లక్ష్మి, ఎ.ఆర్.ఓ లు సునీల్, భీమ రాజు, ఎం.సి.సి టీం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 200 కుటుంబాలు

విశాలాంధ్ర-మంగళగిరి: నియోజకవర్గంలో టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. పట్టణ ప్రముఖ బీసీ నేత ఆకురాతి నాగేంద్రం సహా 200 కుటుంబాలు యువనేత నారా లోకేష్ సమక్షంలో సోమవారం ఉండవల్లిలోని నివాసంలో పార్టీలోకి చేరారు. వారందరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. నాగేంద్రంతో పాటు గోలి నాగార్జున, కొల్లి వెంకట రమణ, కాసుల వేణు, కాటాబత్తుల విజయ్, పెంటపాటి రవి, మునగాల శ్రీనివాస్, వద్ది వసంత, ఆకురాతి శ్రీను, చీపురి వెంకటేశ్వరరావు, నాగు లపల్లి వెంకటరత్నం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... బంగారు నగల పేరు చెబితే మంగళగిరి గుర్తొచ్చేవిధంగా మంగళగిరి ప్రాంతాన్ని గోల్డ్ హబ్‌గా తీర్చిదిదుతామని పేర్కొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, దామర్ల రాజు, షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, జగ్గారపు రాము, మంద్రు రాము, చిలకా వెంకటేశ్వరరావు, గుంటి నాగరాజు, వంగర రమేష్, కాశిన కొండలు, పడిశ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపై మోదీ మాట్లాడకపోవడం శోచనీయం

విశాలాంధ్ర, తెనాలి : చిలకలూరిపేట ప్రాంతంలో జరిగిన ప్రధానమంత్రి మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ల సభలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాను గురించి మాట్లాడకపోవడం విచారకరమని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు విమర్శించారు. బిజెపి, దాని మిత్రపక్షాల సభలో కేవలం వారి స్వలాభాపేక్ష ప్రసంగాల మినహా దేశ, రాష్ట్ర అభివృద్ధిని గురించి ఏమాత్రం మాట్లాడలేదని అది ప్రజలు గ్రహించాలన్నారు. 10 ఏళ్ల పాలనలో మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య వైసమ్యాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్దిపొందాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో నాగసూర్య, శశిధర్, శివకుమార్, సత్యనారాయణ, కృష్ణ, వీరయ్య, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై నిర్లక్ష్యం తగదు: డా.ప్రత్యూష

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దంత సమస్యలు పట్ల నిర్లక్ష్యం తగదని దంత వైద్యురాలు డాక్టర్ కొండా ప్రత్యూష తెలిపారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో 'ఉచిత దంత వైద్య శిబిరం' నిర్వహించారు. ఈ శిబిరాన్ని నంబూరు చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కొండా కోటిరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె శిబిరానికి వచ్చిన 320 మంది సీనియర్ సిటిజన్స్‌కు వారి దంతాల పరిస్థితి గురించి.. దంత వ్యాధులు గురించి వివరించారు. ఇంట్రా ఓరల్ కెమోరా, స్కానర్ టెక్నాలజీ ద్వారా దంతాల పని తీరును ప్రత్యక్షంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ దంత సమస్యలు ఉన్న వారు తక్షణమే దంత వైద్యులను సంప్రదించి తగు మందులు తీసుకోవాలని కోరారు. వృద్ధాప్యంలో దంతాలు, చిగుళ్ళకు సంబంధించిన సమస్యలు రావటం, దంతాలు బలహీనపడిపోయి రాలిపోతుండటం జరుగుతాయన్నారు. బాగా పులుపుగా ఉన్న పదార్థాలు తినటం, తాగటం వల్లగానీ, బాగా వేడిగా ఉన్న వాటిని తీసుకోవడం వల్లగానీ దంతాలపై ఒత్తిడి పెట్టి శుభ్రం చేసే ప్రయత్నాల వల్ల గానీ ఎనామిల్ దెబ్బతిటుందన్నారు. దంతాలను శుభ్రం చేసుకొనేందుకు మీడియం అని ముద్రించి ఉన్న బ్రష్‌లను వాడా లని సూచించారు. పళ్ళపై గార శుభ్రం చేయించుకుంటూ ఉండాలని కోరారు. రోజుకు రెండుసార్లు దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక కేవీస్ ఆర్‌టీ మున్సిపల్ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రంలో జరిగిన పదవ తరగతి ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షను సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. పరీక్షలలో ఎలాంటి మాల్ ప్రాక్టిస్ జరగకుండా చూడాలని డీఈఓ శైలజను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉదయం జరిగిన పదవ తరగతి ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షలకు 29,126 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 27,868 మంది (95.68 శాతం) హాజరయ్యారు. 1,258 మంది విద్యార్థులు గైర్హ జరయ్యారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

బహిరంగ ప్రకటన

మాక్లయింటు గుంటూరు జిల్లా, వలివేరు గ్రామం, డోర్ నెం:7-147 కాపురస్తులు కోసూరి కోటేశ్వరావు గారి కుమారుడు వీర రాఘవయ్య గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి గుంటూరు సిటీ, రాజీవ్ గాంధీ నగర్ 1వ లైన్ కాపురస్తురాలు సంగెపు సత్యనారాయణ గారి భార్య లక్ష్మీ ప్రసన్న గారికి విక్రయ ద.నెం: 9484/2003 యస్.ఆర్.ఓ.గుంటూరు రీత్యా సంక్రమించి, అతదాది నేటి వరకు సర్వహక్కులతో అనుభవించుచున్న ఆస్తిని విక్రయించుటకు బహిరంగ పరచగా మా క్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి విక్రయబయాన అగ్రిమెంటు కుదుర్చుకొని కొంత క్రయధనం చెల్లించితిన్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఆక్షేపణలు, తనఖాలు తాకట్లు కోర్టు జప్తులు ఇతర క్లయిములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోగా మాకు గాని మా క్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారములతో తెలియజేయగలరు. గడువులోగా షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎట్టి క్లయిములు రానియెడల నిష్పేచిత ఆస్తిగా భావించి మా క్లయింటు సక్రమమైన విక్రయ దస్తావేజును పొందగలరని, గడవు తదుపరి వచ్చు ఎట్టి అభ్యంతరములు వగైరాలు పరిగణలోకి తీసుకొనబడవు మరియు షెడ్యూలు ఆస్తిని బైండుచేయజాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥& సబ్.డి., జి.ఎం.సి పరిధియాలో చేరిన గుంటూరు సిటీ, గుంటూరు గ్రామం తాలూకు డి నెం: 417/డి1 మింజుమలె చ.గ. 126-1/2 స్థలము అందులోని డోర్ నెం: 7-6-351/28 అసెస్మెంట్ నెం: 1021050130 గల రేకుల ఇల్లు స్థలముకు హద్దులు:తూర్పు: తాడేపల్లి కృష్ణ కుమారి గారి స్థలం హద్దు, అ27-6లు, దక్షిణం:పున్నా లక్ష్మీనారాయణ వగైరాల ఆస్తి హద్దు, అ41-4లు, పడమర: గాజుల సత్తయ్య, గాజుల మల్లయ్య గారల ఆస్తి హద్దు,అ27-6లు, ఉత్తరం: అ25లు వెడల్పు గల రోడ్డు హద్దు,అ41-4లు.

జి. శివ ప్రసాద్ రెడ్డి, డి. భాస్కర రెడ్డి, అడ్వకేట్స్, జిల్లా కోర్టు ఎదురు, గుంటూరు, సెల్: 97004 64049

పరీక్షాకేంద్రాన్ని పరిశీలించిన జేసీ

విశాలాంధ్ర-కారంపూడి: స్థానిక బ్రహ్మానాయుడు జిల్లాపరిషత్ పాఠశాలలో పది పరీక్షాకేంద్రాన్ని సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలిం చారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. మండలంలో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 649 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు హాల్‌టికెట్లు పొందగా మొదటిరోజు 636 మంది హజరయ్యారు. 13 మంది గైర్హజరయ్యారు.

ఒప్పిచర్ల వీఆర్వోకు షోకాజ్ నోటీసు

విశాలాంధ్ర- కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల -1 గ్రామ రెవిన్యూ అధికారిగా పనిచేస్తున్న వి.కోటేశ్వరరావుకు జిల్లా జాయింట్‌కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సోమవారం షోకాజ్ నోటిసు జారీ చేశారు. వీఆర్వో ఎన్నికల కోడ్ నియామావళిని ధిక్కరిస్తు తన వాట్సప్ స్టేటస్‌లో ఓ పార్టీ నాయకుడు వీడియోలు పెట్టాడని జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు అందింది. ఆ ఫిర్యాదు ప్రాధమికంగా నిజమని తేలడంతో కోటేశ్వరరావుకు షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వో కోటేశ్వరరావు బూత్‌లెవల్ అధికారిగా ఉండటం గమనార్హం.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో మొదటి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనాయి. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి రోజున మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 510 మంది విద్యార్థులకు గాను 501 మంది విద్యార్థులు హాజరయ్యారు.

బీజేపీ నేతలతో కన్నా సమావేశం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : రఘురామ్ నగర్‌లోని కన్నా క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అందరం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. రానున్న ఎన్నికలలో నియోజకవర్గంలో ప్రతిపక్ష కూటమి కలసి పనిచేయాలని ప్రతినపూనారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాజీ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన వినుకొండవాసి

విశాలాంధ్ర - వినుకొండ: విశాఖపట్నంలోని వి.ఎం.ఆర్.డి.ఏ పార్కులో ఆదివారం 5 కిలో మీటర్ల మార థాన్ భారత్ నీవేష్ రన్ పోటీలలో పాల్గొన్న జాతీయ క్రీడాకారులు షేక్ అబ్దుల్లా సునాయాసంగా విజయం సాధించి గోల్డ్ మెడల్ సాధించినట్లు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వలంపిక్స్ శిక్షణకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న ప్రముఖులు సుప్రసిద్ధ సినిమా నటుడు సోనూ సూద్, బుల్లితెర జబర్దస్త్ టీం ఆర్థికంగా ఆదుకునేం దుకు ముందు కొచ్చినట్టు ఈ సందర్భంగా తెలియజేసారు. టాలీవుడ్ లోని మరో సుప్రసిద్ధ కరాటి మాస్టర్ సహాయ సహకారాలు అందించేం దుకు ముందుకు వచ్చారని తెలియజేశారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఒలంపిక్స్ పోటీలలో భారత్ తరపున పాల్గొని గోల్డ్ మెడల్ సాధించడమే తన జీవిత ఆశయం అన్నారు.

ప్రారంభమైన పది పరీక్షలు

విశాలాంధ్ర - వినుకొండ: మండ లంలోని 11 పాఠశాలల్లో సుమారు 2470 మంది విద్యార్థిని విద్యార్థులు సోమవారం నుంచి జరుగుతున్న 10వ తరగతి పరీక్ష లకు హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు కేటా యించిన 11 సెంటర్లలో సందడి నెలకొంది. విద్యార్థిని విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించారు. సెంటర్స్ వద్ద ఎటువంటి ఆవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ 144 సెక్షన్ విధించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర-రొంపిచర్ల: పల్నాడు జిల్లాలో గల అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్జేడీ, పల్నాడు జిల్లా అడ్వయిజర్ లింగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలో వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, వి.రెడ్డిపాలెం ఏపి మోడల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన పదవతరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. పరీక్షలలో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా తగు ఏర్పాట్లు చేశామని అన్నారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్ కు పాల్పడకుండా క్యూ ఆర్ పద్ధతిని పాటిస్తున్నామని అన్నారు. ఆయన వెంట ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలకు కట్టుబడి ఉండాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇరు పార్టీల నేతలు అల్లర్లకు తావు లేకుండా ఎన్నికల కమిషనర్ పరిధిలో పనిచేయాలని, సహకరించాలని ఈఆర్‌వో కందుల శ్రీరాములు కోరారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాస్పదంగా వ్యవహరించరాదని, వర్గ విభేదాలు చేయరాదని, ప్రలోభాలు ఆశ చూపరాదని నేతలకు సూచించారు. ఫ్లేయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామని వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశ్వరి, తాసిల్దార్ ప్రభాకర్ రావు, బెల్లంకొండ తాసిల్దార్, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థి భవిష్యత్తు అగమ్యగోచరం

విశాలాంధ్ర-కారంపూడి: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సిబ్బంది నిర్లక్ష్యంతో పదవ తరగతి విద్యార్థిని భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. పదవ తరగతి చదువుతున్న బి ప్రియాంకబాయి హాల్‌టిక్కెట్టులో మొదటిరోజు తెలుగు పేపరు ఉండవలసి ఉండగా హిందీ అని ఉండటంతో పరీక్షాకేంద్రంలో తనకు హిందీ పేపరు ఇచ్చారు. దీంతో తనకు దిక్కుతోచక ఏమి రాయాలో తెలియక భోరున విలపించింది. విద్యార్థినిల డేటాను పాఠశాల సిబ్బంది ఎగ్జామ్‌బోర్డుకు పంపేటప్పుడు నిర్లక్ష్యంగా తప్పుడు సమాచారాన్ని పంపడంతో ప్రియాంక హాల్‌టిక్కెట్టు తప్పుగా ముద్రించి వచ్చింది. వచ్చిన హాల్‌టిక్కెట్‌ను కనీసం చూడకుండా విద్యార్థినికి యిచ్చి పరీక్షాకేంద్రానికి పంపారు. ఈ తప్పులు ఉన్న హాల్‌టిక్కెట్టు వలన తను రాయవలసిన 6 పరీక్షలు కూడా రాయలేని పరిస్థితిలో ఉంది. తనకు న్యాయం చేయాలని ప్రియాంకాబాయి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పగడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ శివ శంకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎస్.ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వాలంటీర్లు ఎవరైనా ఎన్నికల విధులలో ఉంటే తొలగిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న పోస్టర్లను వెంటనే తొలగించాలని ఆయన ఆదేశించారు. దిన పత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సి విజిల్ యాప్‌లో ప్రతి ఒక్కరు డౌన్లోడ్ చేసుకోవాలని, అందులో వచ్చిన అంశాలను 100 నిమిషాల్లో సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా సి విజిల్ నోడల్ అధికారి రామకృష్ణ సి విజిల్ యాప్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి అవగాహన కల్పించారు. ప్రభుత్వం ద్వారా కొనసాగిస్తున్న ఎసెన్షియల్ సర్వీసులను కొనసాగించవచ్చని తెలిపారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ వినాయకం వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభ విజయవంతం: జీవీ, మక్కెన

విశాలాంధ్ర-వినుకొండ: చిలకలూరిపేట వద్ద టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ప్రజా గళం సభ విజయవంతమైందని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సభకు ముఖ్య అతిథిగా మోడీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లుగా అవినీతి పాలన సాగిందని, పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడిన వారికి ప్రాధాన్యతీస్తూ కాలం గడిపారని అన్నారని అన్నారు. ప్రజా గళం సభకు లక్షలాదిమంది ప్రజలు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారని, సుమారు 12 కిలోమీటర్లు దూరం వరకు ట్రాఫిక్ స్తంభించిపోయిందని, సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే. జగన్ రెడ్డి పాలన పై ఎంత వ్యతిరేకత ఉందో.ప్రజలు చూపెట్టారని అన్నారు. సభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన పల్నాడు ప్రజానీకానికి జీవి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల జగన్ మోహన్ రెడ్డి సిద్ధం సభకు ప్రజలు రాక సభ బక్క చిక్కి పోయిందన్నారు. ఇక టిడిపి హయాంలో చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు 72 శాతం పనులు పూర్తి చేస్తే. ఈ ఐదేళ్లు జగన్ రెడ్డి అది పూర్తిచేయలేకపోయారని అన్నారు. అలాగే ఆనాడు అమరావతి రాజధాని నిర్మాణానికి చంద్రబాబు పదివేల కోట్లు ఖర్చుపెడితే. జగన్ రెడ్డి మూడు రాజధానులు అంటూ ఎక్కడా ఒక్క ఇటుక కట్టుబడి చేయలేదని జీవీ విమర్శించారు. విశాఖలో జగన్ రెడ్డి ఆయన బినామీలు దోచుకున్న భూములకు ధరలు వచ్చేందుకే విశాఖ రాజధాని అంటూ జగన్ రెడ్డి కాలం గడిపాడన్నారు. నేడు రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు తదితర అంశాలపై చంద్రబాబు ఎన్డీఏతో జతకట్టడం జరిగిందన్నారు. ఎన్డీఏ కూటమితో రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి 167 స్థానాలు గెలుచుకుంటుందని జీవి అన్నారు. మక్కెన మల్లికార్జున రావు మాట్లాడుతు టిడిపి, జనసేన, బిజెపిల కలయికను ప్రజలు ఆదరించారన్నారు. ఇక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ఇక బొల్లా బ్రహ్మానాయుడు వద్దకు ఏ అధికారి వెళ్లిన సహించేది లేదని ఘంటా పథంగా చెప్పారు. ఇప్పటికైనా బ్రహ్మానాయుడు తన పద్ధతి మార్చుకొని అబద్ధాలు మాట్లాడటం ఆపేసి. హుందాగా వ్యవహరించుకోవాలని లేనిచో తగిన సమాధానం చెబుతామన్నారు. వినుకొండ అభివృద్ధిపై ఎవరూ ఎంత అభివృద్ధి చేశారో బహిరంగ చర్చ ద్వారా తేల్చుకుందా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో షమీంఖాన్, అయూబ్ ఖాన్, గంగినేని అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభ విజయవంతంతో చరిత్ర సృష్టించారు: ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : తెలుగుదేశం, జనసేన, బీజేపీ 3 పార్టీల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా బొప్పూడి వద్ద నిర్వహించిన ప్రజాగళం సభకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా ప్రజలు హాజరై చరిత్ర సృష్టించారని ప్రత్తిపాటి పుల్లారావు తెలియజేశారు. దక్షిణ భారతదేశంలో ఇప్పటివరకూ జరిగిన సభలలో ఇదే అతి పెద్ద సభ అని పలువురు నేతలు తనతో వ్యాఖ్యానించడం తనకెంతో సంతృప్తినిచ్చిందని ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రధాని మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సభను ఆద్యంతం అద్భుతంగా నిర్వహించారని వారు తెలియజేశారు. హెలికాప్టర్‌లో సభా ప్రాంగణానికి చేరుకునే సమయానికి ఏరియల్ సర్వేలో సభా నిర్వహణా ప్రదేశం చుట్టూ కిలోమీటర్ల దూరంలో ప్రజలే కనిపించారని మోదీ బాబుతో చెప్పడం జరిగిందని ప్రత్తిపాటి తెలిపారు. ఇంతటి గొప్ప సభను నిర్వహించడానికి భూములిచ్చిన రైతులకు ముందుగా నా ధన్యవాదాలు అని ప్రత్తిపాటి తెలిపారు. సభావేదిక, పార్కింగ్ తదితర అవసరాలకు 300 ఎకరాలు భూమిని మాకు అందించడంలో రైతులు అందించిన సహకారం ఎన్నటికీ మరువలేనిదని అని ప్రత్తిపాటి తెలియజేశారు.

2014 గుంటూరులో ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో జరిగిన తొలి సభలో నాటి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా సభను పర్యవేక్షించానని, మరలా పదేళ్ల తరువాత నా పర్యవేక్షణలోనే ఎన్డీఏ పక్షాల ఆధ్వర్యంలో తలపెట్టిన తొలి బహిరంగ సభ ఇక్కడ జరగడం నా అదృష్టమని మోదీతో తెలిపానని, నాటి సెంటిమెంట్ మరలా పునరావృతం అవుతుందని, 3వ సారి అధికారంలోకి వచ్చి మీరు హ్యాట్రిక్ సాధించబోతున్నారని మోడీకి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశానని ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. వారం రోజులు పాటు నియోజకవర్గంలో పార్టీలోని అన్ని హోదాలలోని నాయకులు నిద్రాహారాలు మాని సభను విజయవంతం చేయడానికి కృషి చేశారని వారు తెలిపారు. సభ సజావుగా సాగడానికి సహరించవలసిన ప్రభుత్వం ఏ మాత్రం సహకరించకపోగా, సభ జరిగే సమయంలో 3 సార్లు విద్యుత్ సరఫరాను నిలిపివేసిందని, మైక్ సిస్టమ్ ఆర్గనైజింగ్ ఏరియాలోకి దూకిన వారిని నియంత్రించా లని సాక్షాత్తూ దేశ ప్రధాని అభ్యర్థించినా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోకుండా విఫలం చెందారని, ట్రాఫిక్ ఆంక్షలు పేరుతో లక్షలాది మందిని సభా స్థలికి చేరుకోకుండా చేశారని, ఇటువంటి చర్యలతో ప్రభుత్వానికి అప్రతిష్ట తప్పా, సాధించేది ఏమీ ఉండదని హితవుపలికారు.

పది పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా రాయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ అన్నారు. నరసరావుపేటలోని లింగంగుంట్ల వద్ద ఉన్న శంకర్భారతిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభ మైన పదవ తరగతి పరీక్షల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ పలు వివరాలు సేకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, చీఫ్ సూపరింటెండెంట్ పార్వతితో మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చారా, సమస్యలు ఏమైనా ఉన్నాయా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు రూములలో కలియ తిరిగి పరీక్షా సరళిని ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఎస్పీని కలిసిన పట్టణ సీఐ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డిని సోమవారం తన కార్యాలయంలో సత్తెనపల్లి పట్టణ నూతన సీఐ శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల భాగంగా ఈయన సత్తెనపల్లి వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహణకు కృషి చేయాలని ఎస్పీ ఆయన్ను ఆదేశించారు.

నగరాన్ని గుంటలూరుగా మార్చేశారు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని ప్రధాన రాజకీయ పార్టీలన్ని గుంటలూరుగా మార్చివేశాయని ఏపీఆర్ఎస్ పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అల్తాఫ్ ధ్వజమెత్తారు. సోమవారం శ్రీనగర్ మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తమ ప్రాంతాలను ఇప్పటివరకు ఏ పార్టీల వారు కూడా సందర్శించలేదని అన్నారు. ఇక్కడ సమస్యలు ఉన్నప్పటికీ ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందని అన్నారు. రోడ్లు, విద్యుత్తు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యలు ఎన్నో ఉన్నాయని అన్నారు. వాటిని పరిష్కరించడం కోసం ఏ ఒక్క అధికార ప్రతిపక్ష పార్టీల వాళ్లు తమ ప్రాంతాలకు రాలేదని వారు అల్తాఫ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి అల్తాఫ్ మాట్లాడుతూ తమ పార్టీని గెలిపిస్తే ప్రజలకు మౌలిక అవసరాలు అయినటువంటి రోడ్లు, విద్యుత్తు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలతో పాటు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీఎస్‌పై విధిగా అవగాహన అవసరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : బ్యాంకింగ్ రంగంలో ఉన్న ప్రతి ఒక్కరూ టీడీఎస్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆదాయపు పన్ను శాఖ అధికారి జగదీష్ కోరారు. విజయవాడలోని టీడీఎస్ కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరు ఆదాయ పన్ను శాఖ టీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జీడీసీసీ బ్యాంకులో టీడీఎస్‌పై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది సంపూర్ణ అవగాహనతో సక్రమంగా టీడీఎస్ అమలయ్యేలా చూడాలని సూచించారు. ఆదాయ పన్ను శాఖ ఇన్స్‌పెక్టర్ కిరణ్ కుమార్ టీడీఎస్ చెల్లించే అంశంలో పాటించాల్సిన నియమ నిబంధనలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జీతాలపై ప్రతి నెలా దామాషా పద్ధతిలో టీడీఎస్ చేయాలని, డిపాజిట్లపై వచ్చే వడ్డీతో పాటు బ్యాంకు భవనాలకు చెల్లించే అద్దె 2,40,000 దాటితే విధిగా 10శాతం టీడీఎస్ ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలోని కో-ఆపరేటివ్ బ్యాంకుకు సంబంధించిన అన్ని బ్రాంచీల మేనేజర్లు హాజరైన ఆదాయ పన్ను అధికారి రాజశేఖర్, జీడీసీసీ బ్యాంకు సీఈఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: రానున్న ఎన్నికలలో గ్రామస్తులందరూ గొడవలకు దూరంగా ఉండి ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు సహకరించాలని రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ రావు అన్నారు. గ్రామాల్లోని ప్రజలకు పోలీసు బలగాలపై అవగాహన కల్పించేందుకు మండలంలోని కారుమంచి గ్రామంలో సోమవారం పోలీసు, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రూరల్ సీఐ మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలంతా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఏమైనా సమస్యలుంటే ముందుగానే పోలీసుల దృష్టికి తేవాలని కోరారు. చదువుకునే విద్యార్థులు గొడవలకు దూరంగా ఉండాలని, కేసులు నమోదైతే ఉద్యోగ సమయంలో ఇబ్బందులు గురవుతారని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర-ఈపూరు: రాష్ట్రంలో నేటి నుంచి మొదలైన పదవ తరగతి పరీక్షలు మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో ముప్పాళ్ళ, ఈపూరు హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్జెడి లింగేశ్వర రెడ్డి పరీక్షా కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలోని కొండ్రముట్ల గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి సురేంద్ర ముప్పాళ్ళ గ్రామానికి బైక్ పై పరీక్ష రాసేందుకు వెళ్తూ ప్రమాదానికి గురై కాలు విరిగింది. క్షతగాత్రుణ్ణి చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. మండలంలో మొత్తం 499 విద్యార్థులకు గాను 489 మంది హాజరయ్యారు.

వైసీపీలోకి టీడీపీ ముస్లిం ముఖ్యనేతలు

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని పలువురు ముస్లిం ముఖ్య నేతలు టీడీపీని వీడి వైసీపీలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో చేరారు. అమరావతిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వారి సతీమణి నంబూరు వసంతకుమారి సమక్షంలో భారీగా ముస్లిం సోదరులు వైసీపీలో చేరారు. 60 కుటుంబాలకు చెందిన ముస్లిం సోదరులు, మహిళలు వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మేలు చేస్తున్నాయన్నారు. అందుకే ఎంతోమంది తమ పార్టీలో చేరుతున్నారన్నారు. ఈసారి ఎన్నికల్లో కూడా ఇప్పటివరకు ఆరుగురు ముస్లిం సోదరులకు సీఎం జగన్ ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారన్నారు. కానీ చంద్రబాబు మాత్రం ఒక్కరికే ఇచ్చారన్నారు. అమరావతిలో 600 ఇళ్ల స్థలాలు ఇస్తే అందులో 198 మంది ముస్లిం అక్కచెల్లెమ్మలకు ఇళ్లస్థలాలు ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో 500 కంటే ఎక్కువ ముస్లిం జనాభా ఉన్న గ్రామాల్లో షాదీఖానాలు నిర్మిస్తున్నామన్నారు. అమరావతి మండలంలో ఇప్పటికే 4 షాదీఖానాలు నిర్మించామన్నారు. పేదల పక్షాన నిలబడిన సీఎం జగన్‌ను ఓడించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ అక్రమ పొత్తులు పెట్టుకున్నాయని విమర్శించారు. నిన్నటివరకు తిట్టుకున్న వారందరూ ఇప్పుడు కలిసిపోయారన్నారు. వైసీపీలో చేరిన వారిలో మహబూబ్ జానీ, మహ్మద్ షా, బషీర్, షేక్ జైన్ బీ, రేష్మా, ముబీనా, మస్తాన్ బీ, షేక్ మౌలాబీ, షేక్ ఆశా, సలీమా, షేక్ మహబూబ్ సుభాని, జెల్సి, నాగుల్ మీరా తదితరులున్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలని వినతి

విశాలాంధ్ర-తాడేపల్లి: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండగ సందర్భంగా తాడేపల్లి లోని సమాధులలో పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతూ సోమవారం ఎంటిఎంసి నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ కి తాడేపల్లి పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందచేశారు. వైసీపీ బీసీ సెల్ నాయకులు బత్తుల దాసు, తాడేపల్లి పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షులు బాలసాని అనిల్, గొర్రుముచ్చు సుదర్శనం, కొరగంటి ఉదయరాజు, ఎం విజయకుమార్, బేతం భాస్కర్, రోడ్డ ఎలిషా, ఈటె హనోక్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రజలను వంచించిన మీకు ఓటెందుకు వేయాలి: మస్తాన్‌వలి

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ ప్రజలను అన్ని విధాల వంచించిన ప్రధాని మోదీ, ప్రజాగళం సభలో బీజేపీకి ఓటు వేసి కేంద్రంలో మూడవ సారి గెలిపించాలని కోరటం సిగ్గుచేటని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. గుంటూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి పార్టీల ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభ అట్టర్ ఫ్లాప్ అని ఎద్దేవాచేశారు. రాష్ట్రానికి ఏమి చేయని బీజేపీతో భాగస్వాములైన టీడీపీ, జనసేనలకు ప్రజలు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. ప్రధాని మోదీ వైసీపీ, కాంగ్రెస్ రెండు ఒకటే అని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్‌పై షర్మిళ పోరాడుతుందని అదే సభలో చంద్రబాబు అన్న విషయం రాష్ట్ర ప్రజలు విన్నారని అన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన సంస్థల పేర్లు మాత్రమే మోదీ చదివారని, అవి ఎక్కడ ఇంకా నిర్మాణం జరుగలేదని చెప్పారు. బీజేపీకి ఆంధ్రప్రదేశ్‌లో మనుగడ లేదని మోదీ తన ఉనికి కాపాడుకోవడానికి రాష్ట్రంలోని మూడు పార్టీల నాయకులతో చట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారని విమర్శించారు. సీబీఐ, ఈడీని అడ్డుపెట్టుకుని ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో అతి పెద్ద స్కామ్‌కు బీజేపీ పాల్పడిందని ఆరోపించారు. దీని వెనుక ఎవరెవరు ఉన్నారో విచారణ జరిపించి ఎలక్టోరల్ బాండ్ల గురించి నిజనిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్, చుక్క చంద్రపాల్, గడ్డం పాల్ విజయకుమార్, అంబటి రత్తయ్య, పోల్ రెడ్డి, సుధీర్ బాబు, షేక్ మౌలాలి, వాల్మీకి శ్రీనివాస్, శివశంకర్, బాబురావు, సయ్యద్ జానీ గోల్డ్, బాజీ, బోడపాటి శ్రీను, మల్లెల మోషే, మల్లవరపు చిన్న, బిల్లా సునీల్, కాపూరి పరిశుద్ధరావు, పాకనాటి నరేష్, షేక్ గౌసియా, బాలస్వామి, అయూబ్, ఉస్మాన్ పాషా, షేక్ రహంతుల్లా, మోహనరావు, అంకమ్మరావు, సుబ్రహ్మణ్యం, రాజు, వాసుదేవ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-శావల్యాపురం : స్థానిక జడ్పీ పాఠశాలలో సోమవారం ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. వినుకొండ ఆర్టీసీ డిపో అధికారులు ఏర్పాటు చేసిన మూడు బస్సులలో వేల్పూరు, పోట్లురు, మతుకుమల్లి, కారుమంచి గ్రామాల నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది పరీక్షా కేంద్రాల ద్వారాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. 263 మంది విద్యార్థులు పరిక్షకు హజరయ్యారు. ఎస్ఐ చల్లా సురేష్ పర్యవేక్షణలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. పరిక్షా కేంద్రాలను తహసీల్దారు నక్కా లక్ష్మీ లావణ్య, ఫ్లయింగ్ స్క్వాడ్ మల్లిఖార్జున శర్మలు తనిఖీలు నిర్వహించి, పరీక్ష కేంద్రాల వద్ద వసతులను పరిశీలించారు.

శాలివాహనుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-రెంటచింతల : శాలివాహనుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మాచర్ల నియోజకవర్గ శాలివాహనులు సాధికారత సమితి కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు నేతలు సోమవారం ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. మాచర్లలో 25 సెంటర్ కమ్యూనిటీ భవనం నిర్మించాలని, రాయితీపై వ్యక్తిగత రుణాలు మంజూరు చేయించాలని, నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత కల్పించాలని ఆ వినతిపత్రంలో కోరారు. తప్పక నెరవేరుస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు. వీరి వెంట ఏడుకొండలు, బి.శ్రీనివాసరావు, సిద్దయ్య, పవన్ కుమార్, మల్లిఖార్జునరావు తదితరులు ఉన్నారు.

శివరామ్‌కు పార్టీలో సముచిత స్థానం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుమారుడు కోడెల శివరామ్ వద్దకు అధిష్టానం దూతగా ఎమ్మెల్సీ చిరంజీవి రావు సోమవారం సత్తెనపల్లి వచ్చారు. ఈ సందర్భంగా కోడెల కార్యాలయంలో ఆయన మాట్లడుతూ కోడెల శివప్రసాదరావు సేవలు చిరస్మరణీయమన్నారు. తెలుగుదేశం పార్టీ ఉన్నంతకాలం కోడెల పార్టీ అస్తి అని వారి కుటుంబానికి ఎప్పుడు పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీలో సముచితస్తానంతో పాటుగా, ఆ కుటుంబ సేవల్ని పార్టీ కోసం పూర్తిగా వినియోగించుకుంటామని చంద్రబాబు మాటగా చెబుతున్నామన్నారు. త్వరలో చంద్రబాబు సమక్షంలో శివరామ్‌కు స్పష్టమైన హామీతో పాటుగా పల్నాడు జిల్లాలో పార్టీకి పూర్తిగా అండగా ఉండే భాధ్యత అప్పగించే పనిలో అధిష్టానం ఉందని చెప్పారు.

మాతాజీకి అంబటి పరామర్శ

విశాలాంధ్ర-సత్తెనపల్లి: శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం వంశ పారంపర్యం మఠాధిపతి, ధర్మకర్త చింతాడ లలితాంబ మాతాజీకి మంత్రి అంబటి రాంబాబు సోమవారం పరామర్శించారు. వృద్ధాప్య సమస్యలతో స్థానిక గజ్జల హాస్పటల్ నందు చికిత్స పొందుతున్న ఆమెను అంబటి పలుకరించారు. ఈసందర్భంగా ఆశ్రమం బాధ్యులు ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నీ అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో తిరిగి వెళ్ళతారని అయన అన్నారు. అంబటి వెంట పార్టీ సీనియర్ నాయకులు పక్కాల సూరిబాబు, బాసు లింగారెడ్డి, రాయపాటి పురుషోత్తం తదితరులు ఉన్నారు.

భార్యపై దాడి చేసిన భర్తకు రిమాండ్

విశాలాంధ్ర-అమరావతి : మండల పరిధిలోని అత్తలూరు గ్రామానికి చెందిన కోట అర్జున్, కోట మేరీలకు గత 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్లు సాగిన సంసారంలో దురాలవాట్లకు లోనైనా కోట అర్జున్ మధ్యకాలంలో భార్య మేరీని మానసికంగా, శారీరకంగా వేధిస్తూ పిల్లలను కూడా పట్టించుకోకుండా బాధలు పెడుతున్న విషయాన్ని గమనించిన మేరీ తల్లిదండ్రులు, మేరీ కలిసి అమరావతి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయగా వారిరువును కూర్చోబెట్టి పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఈ మధ్యకాలంలో గతం లాగానే అర్జున్ దాడులు చేస్తూ ఉంటే సహించలేని మేరీ అమ్మవారి ఇంటికి వెళ్లి తలదాచుకున్నది. ఈ సందర్భంలో 16వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంటకు రోకలి బండ తీసుకొని మేరీ తల్లిదండ్రుల దగ్గర ఉన్న విషయాన్ని గుర్తించిన అర్జున్ మేరీ తలపై రోకలితో గట్టిగా కొట్టడంతో రక్తస్రావంతో అమరావతి పోలీస్ స్టేషన్‌ని ఆశ్రయించింది. అమరావతి ఎస్సై వెంకటేశ్వరరావు, సీఐ ఏవీ బ్రహ్మోం ఆధ్వర్యంలో.అర్జున్‌పై కేసు నమోదు చేసి 18వ తేది సత్తెనపల్లి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ప్రజా గళం సభ కాదు... ప్రజా గరళం సభ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : బీజేపీ, టీడీపీ, జేఎస్‌పీలు ఉమ్మడిగా ఏర్పాటు చేసిన సభ ప్రజా గళం సభ కాదు ప్రజల మీద చిమ్మిన గరళం వంటిదని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.రాధాకృష్ణ విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత పది సంవత్సరాల పాలనా కాలంలో దేశం గర్వపడే ప్రజలు మెచ్చుకునే ఏ ఒక్క పని అయినా చేశారా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యంగా తెలుగు ప్రజలను మోసగించిన నరేంద్ర మోదీకి ఆంధ్ర గడ్డమీద కాలు మోపే అర్హత లేదని అన్నారు. మణిపూర్‌లో మోదీ చెప్పిన డబుల్ ఇంజన్ ప్రభుత్వము అధికారంలో ఉన్నప్పటికీ మారణ హోమం జరిగి వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని దాడులు నిత్య కృత్యమయ్యాయని ప్రార్థన మందిరాలు కూలగొడుతున్నా, మహిళలను నగ్నంగా ఊరేగించి సజీవ దహనం చేస్తున్న పాలకులు కళ్ళుండి చూడలేని గుడ్డివారి వలె వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎస్సీలకు దళిత క్రైస్తవులకు క్షమాపణ చెప్పి నరేంద్ర మోదీ ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. అతి త్వరలోనే సీఏఏ చట్టాన్ని అమలు చేస్తున్నామని ముస్లిం మైనారిటీలకు గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్ రద్దు చేస్తున్నామని ముస్లిం మైనారిటీలలో భయాందోళనలు కలిగిస్తున్న నరేంద్ర మోదీ వారికి ఏమాత్రం భరోసా ఇచ్చే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. నరేంద్ర మోదీకి తెలుగు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. ంకౌరవ కూటమికి పరోక్షంగా బీజేపీని బలపరిచే వైసీపీ ఒక వైపు కాంగ్రెస్, కమ్యూనిస్టు, వీసీకే పార్టీలతో కూడిన పాండవుల కూటమికి మధ్య జరిగే ఎన్నికల కురుక్షేత్రంలో అంతిమ విజయం ఇండియా కూటమికే లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు : ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని రద్దు చేయాలని ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షులు చలసాని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్, కార్యవర్గ సభ్యుల సమావేశం నగరంలోని అరండల్‌పేట జిల్లా వైన్ డీలర్స్ అసోసియేషన్ కళ్యాణమండపంలో జరిగింది. ఈ సమావేశానికి ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షులు, బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్ కుమార్ అధ్యక్షత వహించగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ సురేష్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బార్ కౌన్సిల్ మెంబర్ వి.చంద్రశేఖర్ రెడ్డి, జె.నరసింహారావు, ఉప ప్రధాన కార్యదర్శులు ఎండీ షరీఫ్, పర్చూరు కుమారి నంద, రాష్ట్ర ట్రెజరర్ బోను జయమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్ధ సత్యనారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుంజి రమేష్, ఐఏఎల్ గుంటూరు జిల్లా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి సత్యనారాయణ, దాసరి ఉమామహేశ్వరరావు, ఐఏఎల్ గుంటూరు జిల్లా సభ్యులు వి.రాధాకృష్ణమూర్తి, కోట మాల్యాద్రి, జి.దుర్గా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొని మాట్లాడారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘమైన చర్చ నిర్వహించారు. తదితర తీర్మానాలను రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో భారత న్యాయవాదుల సంఘం(ఐఏఎల్) తీర్మానించింది.